క్లుప్తంగా

'రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వాలి'

జనగామ: పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ విషయంలో జాప్యం చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండ మల్ల రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. పాలమూరు జిల్లాకు చెందిన ఓ ఉద్యోగి పదవీ విరమణ పొందిన తర్వాత, బెనిఫిట్స్ రావడం లేదని వీడియోలో తన బాధన వెల్లగక్కడం చాలా బాధేసిందన్నారు. ఏ ఒక్క ఉద్యోగికి కూడా ఇలాంటి పరిస్థితి రాకూడదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేయకుండా ఈ కుబేర్‌ను వెంటనే రద్దుచేసి, ట్రెజరీ ద్వారా బిల్లులు చెల్లించాలన్నారు. ఈ విషయాన్ని అన్ని శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ముక్తకం ఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఆలస్యం కాకుండా బెనిఫిట్స్‌ను అందించి, గౌరవ ప్రదంగా చూసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి గారు ఆర్థిక శాఖా మంత్రికి విన్నవించారు.

వాటర్ ఫిల్టర్ బహూకరణ



నర్మెట: వెల్దండ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుద్ధమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో 1995 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బుధవారం రూ. 20వేల విలవ చేసే వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఎంఈఓ ఐలయ్య, మాజీ సర్పంచ్ నర్రా వెంకట రమణారెడ్డి, మాజీ ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి, పాతూరి తిరుమల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గోల్ కొండ ఆనందం, గూడ కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

జఫర్‌గఢ్: విద్యార్థులు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని శివునిపల్లి లయన్స్‌క్లబ్ చార్టర్ అధ్యక్షుడు మంగు జయప్రకాశ్ సూచించారు. మండలంలోని తమ్మడపల్లి (జి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్లబ్ ఆధ్వర్యంలో వ్యక్తిగత ఆరోగ్యంపై బుధవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం 60 మంది విద్యార్థినులకు శానిటరీ న్యాప్కిన్లను అందజేశారు. దస్తగిరి, హెచ్‌ఎం సీతారామయ్య పట్టల మహేందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

పాలకుర్తి టౌన్: మండలంలోని వల్మిడి సీతారాంచంద్రస్వామి ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమండ్ల ఝాన్సీరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు స్వామి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, అర్చకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

లింగాలఘణపురం: మండలంలోని జనగామ -సూర్యాపేట రోడ్డులో నెల్లుట్ల వద్ద జరిగిన రోడు ప్రమాదంలో కుందారానికి చెందిన బైరు అబ్బసాయిలు (60) దుర్మరణం చెందాడు. అబ్బసాయిలు ద్విచక్ర వాహనంపై కుందారం నుంచి జనగామకు వెళ్తుడగా జనగామ నుంచి ప్రకాశం జిల్లా డిండికి కారులో వెళ్తున్న జయ సూర్య ఢీకొట్టడంతో అబ్బసాయిలు కాలు విరిగి తీవ్ర రక్తస్రావమై జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. అబ్బసాయిలు కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పాలకుర్తి టౌన్: ఈ నెల 4న మండలంలోని దర్దేపల్లి గ్రామంలో డీసీఎం వ్యాన్, మోటర్ సైకిను ఢీకొట్టిన ఘనటనలో తీవ్రంగా గాయాపడిన కొడకండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన పెంతల మోహన్(50) బుధవారం హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మోహన్‌కు భార్య, కుమారుడు, కూమార్తె ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మేస్త్రీ ఆత్మహత్య

లింగాలఘణపురం: మండల కేంద్రానికి చెందిన నక్కపల్లి శంకర్ (45) ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ కలహాలతో బుధవారం తూటి వెంకటేశ్ వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శంకర్ ఉదయం తూటి వెంకటేశ్ వ్యవసాయ బావి వద్దకు వచ్చి కల్లు తాగి అక్కడే మంచంపై చింత చెట్టుకు ఉరి వేసుకున్నాడు. పశువులకు నీళ్లు పెట్టేందుకు వెళ్లిన వెంకటేశ్ భార్య భాగ్య చెట్టుకు వేలాడుతున్న శంకర్‌ను చూసి సమీప వ్యవసాయదారులకు తెలుపగా అప్పటికే మృత్యువాత పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

వైకుంఠ ద్వార దర్శనానికి ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ లక్ష్మీప్రసన్న

చిల్పూరు: చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామిని ఈనెల 10వ తేదీ(శుక్రవారం)న ద్వార దర్శనం చేసుకునేందుకు ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాటు చేస్తున్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గత నెల 16 నుంచి ఈనెల 14వరకు ఆలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ముఖ్యమైనది వైకుంఠ ద్వార దర్శనం. ఈ దర్శనానికి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో వివిధ ప్రాంతాల నుంచి వీవీపీలు, భక్తులు, దాతలు ఆలయానికి అధిక సంఖ్యలో రానున్నారు. వీరి కోసం చిల్పూరు గుట్ట వద్ద ఆలయానికి చెందిన సత్రాలు, ప్రైవేట్ వసతి గదులను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.



ఆలయ ముఖ ద్వారం (ఇన్‌సెట్‌లో) మూలవిరాట్

వసతులు కల్పిస్తున్నాం..



ధనుర్మాస ఉత్సవాల్లో ముఖ్యమైనది వైకుంఠ ద్వార దర్శనం. కావున ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయం వద్ద అన్ని వసతులు కల్పిస్తున్నాం.

\- బి. లక్ష్మీప్రసన్న, ఈఓ

ఇబ్బంది కలగకుండా చర్యలు



ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయానికి స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఏ ఇబ్బంది కలగకుండా ధర్మకర్తలతో కలిసి చర్యలు తీసుకుంటున్నాం. వసతి గదులు కూడా అందుబాటు ధరల్లో ఏర్పాటు చేశాం.

\- పి.శ్రీధర్‌రావు, ఆలయ చైర్మన్

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- సీఐ అబ్బయ్య

నర్మెట: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ ముసుకు అబ్బయ్య అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సై నైనాల నగేష్‌తో కలిసి మాట్లాడారు. అపరిచిత వ్యక్తులనుంచి వచ్చే ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని, పోలీసులమని బెదిరింపు కాల్స్ వచ్చినా, బ్యాంక్ సిబ్బందిమని వివరాలు అడిగినా కంగారు పడవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసానికి గురైతే వెంటనే 1930కు డయల్ చేసి వివరాలు తెలియ జేయాలని సూచించారు. సెల్ ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, బెట్టింగ్‌లకు, అనవసరమైన యాప్‌ల జోలికి వెళ్లొద్దని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన కలిగి ఉండాలి

పాలకుర్తి టౌన్: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సుధా టెక్నో స్కూల్‌లో సైబర్ నేరాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాపాక విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చిల్పూరు: విద్యార్థులు చదువుపైనే కాకుండా అన్ని



నర్మెట: అవగాహన కల్పిస్తున్న సీఐ అబ్బయ్య

విషయాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తరిగొప్పుల: యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్సై గుగులోత్ శ్రీదేవి అన్నారు. మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాలు, సైబర్ క్రైంలపై అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ బాలోజీ, సిబ్బంది కనుకరాజు, సరోజన తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చట్టాలపై అవగాహన కల్పించాలి

- సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్



అవగాహన కార్యక్రమంలో జడ్జి విక్రమ్ తదితరులు

జనగామ రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు చట్టాలపై అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో పారా లీగల్ వాలంటీర్లకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పారా లీగల్ వాలంటీర్లు సమాజం కోసం పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. డాక్టర్ లిఖిత, న్యాయవాది భిక్షపతి, ఎం.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నియామకం



కల్యాణి

జనగామ: మహిళా కాంగ్రెస్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా జనగామ పట్టణానికి చెందిన మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కల్యాణిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కల్యాణి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు, జాతీయ అధ్యక్షురాలు అల్కలంబ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర, ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ డిక్లరేషన్ హామీని నెరవేర్చాలి

రఘునాథపల్లి/జఫర్‌గఢ్: ఎన్నికల సమయంలో కామారెడ్డి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ హామీని నెరవేర్చాలని బీజేపీ ఓబీసీ మోర్చా రఘునాథపల్లి, జఫర్‌గఢ్ మండలాల అధ్యక్షులు చెవ్వ రాజు, చీకటి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు వేర్వేరుగా బుధవారం పార్టీ నాయకులతో కలిసి ఆయా మండలాల తహసీల్దార్ శంకరయ్య, నాయబ్ తహసీల్దార్ శంకర్‌కు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బోళ్ల అఖిల్, బోల్ల రాజ్‌కుమార్, తోట



జఫర్‌గఢ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహేశ్, కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, మేర్గు రామరాజు, తాటి సురేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

'చర్య తీసుకోవాలి'

జఫర్‌గఢ్: నల్లా, ఇంటి పన్నులకు సంబంధించిన నిధులు స్వాహా చేసిన కూనూర్ కారోబార్ యాదనాల క్రాంతికుమార్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. మండల కేంద్రంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన కారోబార్ జీపీ రశీదులు కాకుండా సొంతంగా ముద్రించిన రశీదులతో గ్రామస్తుల నుంచి పన్నులు వసూళ్లు చేశాడని ఆరోపించారు. ఆ డబ్బులు గ్రామ పంచాయతీ నిధుల్లో జమ చేయకుండా తన సొంతానికి వాడుకున్నాడని తెలిపారు. ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి క్రాంతి కుమార్‌పై చర్య తీసుకోవాలని కోరారు. సమావేశంలో దాట్ల అశోక్, బుల్లె సురేష్, కోట నర్సయ్య, అబ్బురబోయిన ముసలయ్య, సకినాల కొమురెల్లి, మూల మహేష్, పిట్ట వెంకటేష్‌తోపాటు తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీ స్థానాలు పెంచాలి

జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లు గ్రామాభివృద్ధి కోసం రెండు ఎంపీటీసీ స్థానాలను ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు గడ్డం రాజ్‌గౌడ్, బుర్ర తిరుపతిగౌడ్ మాట్లాడుతూ ఉప్పుగల్లు గ్రామంలో 4 వేలకు పైగా ఓటర్లు ఉన్నందున ఎంపీటీసీల స్థానాలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఒక స్థానం నుంచి రెండు స్థానాలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయిని యాదగిరిగౌడ్, గడ్డం శివ శంకర్, గాదెపాక శ్రీను పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ నిషేధిక చైనా మాంజాను ఎవరైనా విక్రయిస్తే చట్టపరంగా తగిన చర్యలు తప్పవని సీఐ జి.వేణు, ఎస్సైలు వినయ్, రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంత్రి పండుగ నేపథ్యంలో సరదాగా పతంగులు ఎగురవేసేవారు ఎవరైనా ప్రమాదకర చైనా మాంజాను వినియోగించవద్దని సూచించారు. ఎవరైనా చైనా మాంజాలను విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

'కాంగ్రెస్ కుట్రలను ఎండగట్టాలి'

దేవరుప్పుల: బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడిచేసిన కుట్రపూరిత దుశ్చర్యలను ప్రతి రాజకీయ పార్టీ ఎండగట్టాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్, మండల అధ్యక్షుడు కాసాని సత్తయ్య అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ ఏడాది పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేయని దౌర్భాగ్య పరిస్థితుల్లో ఉన్న కాంగ్రెస్ తెలంగాణ ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడులు చేసిందన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

జఫర్‌గఢ్: గ్రామాభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి ఆధ్వర్యంలో రఘునాథపల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులు హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని బుధవారం కోరారు. అనంతరం గ్రామానికి చెందిన మదూరు కుమారస్వామికి మంజూరైన రూ.23 వేల సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. నూకల ఐలయ్య, మర్రి సుధీర్‌రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షుడు ఎడ్ల అనిల్

సంక్షిప్త సమాచారం

తదితరులు పాల్గొన్నారు.

కొన్నెను మండలంగా ప్రకటించండి

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామాన్ని నూతన మండలంగా ప్రకటించాలని మాజీ సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నె చుట్టూ గ్రామాలను కలుపుకుని నూతన మండలం చేయాలని కోరగా విషయాన్ని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని ప్రతాప్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. హరిబాబు, దయకర్‌రెడ్డి, ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

'మండల అధ్యక్షుడిని మార్చండి'

బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యకుడు నూకల బాల్‌రెడ్డిని మార్చాలని మండలంలోని పలువురు నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల అధ్యక్షుడు గ్రామాల కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించడం లేదని అన్నారు. ఇందుకు ప్రతాప్‌రెడ్డి పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. విద్యానాథ్, దయాకర్‌రెడ్డి, హరిబాబు, వెంకట్, భాస్కర్, బాల్‌రాజు పాల్గొన్నారు.

29 మందికి కంటి ఆపరేషన్లు

కొడకండ్ల: కొడకండ్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 29 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించినట్లు బుధవారం లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దామెర రవిందర్, గాజుల రాములు తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించారని, వారిని సికింద్రాబాద్ వెస్ట్‌మారేడ్‌పల్లిలోని పుష్పగిరి కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయించినట్లు వారు తెలిపారు.

తప్పిపోయిన మహిళను కుటుంబ సభ్యులకు అప్పగింత

జనగామ రూరల్: తప్పిపోయిన మహిళను కుటుంబ సభ్యులకు సఖీ కేంద్రం నిర్వాహకులు అప్పగించారు. బచ్చన్నపేట మండలం పోచన్నపేటలో మహిళ మూడు రోజులుగా జీపీ ఆవరణంలో ఉంటోందని స్థానికులు, పారా లీగల్ వాలంటీర్ 181 హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో సఖీ కేంద్రం సిబ్బంది అక్కడికి చేరుకుని ఆమెతో మాట్లాడి సఖీ కేంద్రంలో వసతి సౌకర్యం కల్పించారు. బుధవారం ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుని వారిని పిలిపించి ఆమెను అప్పగించారు. నిస్సహాయత స్థితిలో ఉన్న మహిళలు సఖీ కేంద్రం సేవలు వినియోగించుకోవాలని నిర్వాహకురాలు రేణుక అన్నారు.

వీధికుక్కల దాడిలో పలువురికి గాయాలు

బచ్చన్నపేట: వీధి కుక్కల దాడిలో పలువురికి గాయాలైన సంఘటన మండలంలోని ఇటుకాలపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని జేరిపోతుల రామయ్య, కొలుగూరి లక్ష్మి, జేరిపోతుల ఎల్లమ్మలు ఇంటి ఎదుట కూర్చొని ఉండగా వీధికుక్కలు వచ్చి దాడి చేశాయి. దీంతో పలువురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని స్థానికులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు భద్రతపై అవగాహన



అంబులెన్స్ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారులు



డ్రైవర్లకు పువ్వులు ఇచ్చి అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

జనగామ రూరల్: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా ఏరియా ఆస్పత్రి వద్ద అంబులెన్స్ డ్రైవర్లకు రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంబులెన్స్ డ్రైవర్లు పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. జిల్లా రవాణా శాఖ అధికారి జీవీ శ్రీనివాస్ గౌడ్, కానిస్టేబుల్ వెంకటేష్, సమద్, సిబ్బంది ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రఘునాథపల్లి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సేయింట్ ఆల్ఫోన్స్ పాఠశాలలో బుధవారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపకూడదని, అలా నడిపితే వాహన యజమానిపై, తల్లిదండ్రులపై కూడా కేసు నమోదు అవుతుందన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై దూదిమెట్ల నరేష్, ట్రెయినీ ఎస్సై బి సుజిత్, తదితరులు పాల్గొన్నారు.

కళా ప్రదర్శన

లింగాలఘణపురం: జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపవద్దని, హెల్మెట్ ధరించాలని, తల్లిదండ్రులు మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని ఆట పాటలతో కళా ప్రదర్శన ద్వారా వివరించారు. సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు సంజీవ, టీం లీడర్ రత్నం, సభ్యులు శంకర్, గణేష్, సోమయ్య, శ్రీనివాసు, కనకరాజు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి

జఫర్‌గఢ్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నాయకులు, విద్యార్థులు నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. విద్యార్థుల రాస్తారోకోతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళన విరమింపజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న రాథోడ్, మండల అధ్యక్షుడు సిరికొండ అర్జున్, నాయకులు శ్రీకాంత్, త్రిభువల్, రాహుల్, భరత్, రవళి, ప్రభదిప్, రాజేష్ పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న నాయకులు, విద్యార్థులు

అభినందనీయం

- ఎంఈఓ నెల్లుట్ల జానకి

తరిగొప్పుల: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) చేస్తున్న కృషి అభినందనీయమని మండల విద్యాధికారి నెల్లుట్ల జానకి కొనియాడారు. మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడుతున్నాయని, నాణ్యమైన విద్యను అందించడానికి ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేస్తున్నాడని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గాదె జోసఫ్‌బేబి, టీపీటీఎఫ్ బాధ్యులు కొండ శ్రీనివాస్, మనుక సంపత్, జిల్లా కార్యదర్శి కొయ్యడ శ్రీరాములు, జితేందర్ పాల్గొన్నారు.



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న జానకి తదితరులు

చిత్తశుద్ధి ఉంటే కార్యాలయాలు నిర్మించాలి

- కాంగ్రెస్ నాయకుడు సుధాకర్‌రెడ్డి

తరిగొప్పుల: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మండల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే మండలకేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల భవనాలు నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అర్జుల సుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొటోకాల్ పాటించడం లేదని పదేపదే అనే ఆయన ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఆహ్వానించకుండా ఎలా పైపులైను పనులు ప్రారంభించారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడం జరిగిందన్నారు. యూత్ అధ్యక్షుడు దామెర మైఖేల్ మాట్లాడుతూ రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి ఎందుకు చేయలేదన్నారు. నిధులు కేటాయించకుండా సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకున్నారని అన్నారు. ఇప్పుడు నియోజకవర్గంపై సవతి తల్లి ప్రేమ చూపించడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో ఎర్రవెల్లి దానియేల్, దామెర బంటి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం



రఘునాథపల్లి: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని జనగామ ఆర్టీసీ డిపో మెనేజర్ స్వాతి అన్నారు. మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన అయ్యప్ప మాలదారులు డిపో డీలక్స్ బస్సులో వారం రోజుల పాటు 3,600 కిలోమీటర్ల దూరంలోని శబరిమలై అయ్యప్పసామి దర్శనాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం డిపో కార్యాలయంలో డీఎంను కలిశారు. ఈ సందర్భంగా డీఎం వారిని అభినందించి సత్కరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


జనగామ రూరల్: మండలంలోని శామీర్‌పేట గ్రామంలో రూ. 5లక్షల ప్రత్యేక నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గణిపాక మహేందర్, లింగాల నర్సిరెడ్డి, జినుకల రాజు, భాన్సి నాయక్, ప్రకాశ్‌యాదవ్, చాడగొండ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బోరు పనులు..

చిల్పూరు: మండలంలోని కొండాపూర్ గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు గ్రామ ప్రత్యేకాధికారి విక్రమ్ ప్రభుత్వం ద్వారా మంజూరైన బోరు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు త్వరలో తాగునీటి కష్టాలు తీరుతాయన్నారు. రాజు, వీరస్వామి, యాదయ్య పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస తిరుప్పావై మహోత్సవం


రఘునాథపల్లి: మండలంలోని కోమల్ల రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం ధనుర్మాస తిరుప్పావై మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి సౌజన్యంతో ఆలయ వంశపారంపర్య ధర్మకర్తల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ధనుర్మాస ప్రవచనములు చేశారు. ప్రవాచకులు దరిపల్లి సురేశాచార్యులు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ వరకు ధనుర్మాస మహోత్సవాలు కొనసాగుతాయన్నారు. 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా విశిష్ట పూజలు, 14న సంక్రాంతి, భోగి పండుగ సందర్భంగా గోదా కల్యాణం నిర్వహిస్తామన్నారు. నిత్యం దివ్య ప్రబంధ సేవాకాలం, విశేష నివేదనలు వంటి పూజా కార్యక్రమాలు జరుగనున్నట్లు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తరించాలని ఆయన కోరారు.



ధనుర్మాస మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

బచ్చన్నపేట: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మండలంలోని నారాయణపురం సెకండరీ పాఠశాల హెచ్‌ఎం ఇంద్రసేనా రెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దాత హనుమకొండ లయన్స్ క్లబ్ ప్రతినిధి కృష్ణ కిశోర్ నోట్‌బుక్స్ పెన్నులు, పెన్సిళ్లు, పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదివే విద్యార్థులకు ప్రోత్సాహం అవసరం అని అన్నారు. పాఠశాల హిందీ టీచర్ సీహెచ్.అనురాగ ప్రోత్సాహంతో ఈ పరీక్ష ప్యాడ్‌లను అందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నోట్‌బుక్స్ అందజేస్తున్న ఇంద్రసేనారెడ్డి